సాక్షి
గుంటూరు



గురువారం । 31 । అక్టోబర్ । 2024



## శివాలయంలో చండీ హోమం

కొల్లిపర: స్థానిక ప్రసిద్ధ శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం చండీ హోమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## పోలీస్ అమరవీరులకు నివాళులు

మేడికొండూరు: పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా పేరేచర్ల జంక్షన్‌లో బుధవారం రాత్రి శ్రద్ధాంజలి ఘటించారు. సీఐ మీరా సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



నకరికల్లు: నర్సింగపాడులో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మరకత లింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో మాసశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

## చీకటిని పారదోలే
# వెలుగుల వేడుక

• నైతిక విలువలు నేర్పే పర్వదినం • సామాజిక ప్రయోజనాల సమాహారం




చీకటిని పారదోలి వెలుగును నింపే దివ్యమైన రోజు దీపావళి. ఆశ్వయుజ అమావాస్య రోజున జరుపుకొనే విశిష్టమైన పండుగ ఇది. అజ్ఞానం, దార్రిద్యం, భయం, నిరాశ, కాంతిహీనతలు చీకటికి సంకేతం. భగవంతుడు పరంజ్యోతి స్వరూపుడు. చీకటిని పారదోలగల సమర్థుడు. దీపావళి రోజున వెలిగించే దీపాలు ఈ చెడునంతటినీ పోగొడతాయనే నమ్మకం. దీపం వల్లనే సమస్త కార్యాలు నెరవేరతాయి. మహాలక్ష్మి దీపకాంతులతో జ్యోతి తేజస్సుతో విరాజిల్లుతుంటుంది. అందుకే దీపావళి రోజున నువ్వుల నూనె , ఆవు నేతితో ప్రమిదలను నింపి దీపాలను వెలిగిస్తారు. వెలుగుతోనే జగతి అని చాటుతారు. మొత్తం మీద సామాజిక ప్రయోజనాల సమాహారం దీపావళి పర్వదినం.



తెనాలి: దీపావళికి ముందురోజు చతుర్దశి. అదేరోజు నరకాసురుడు అనే రాక్షసుడిని సత్యభామ, శ్రీకృష్ణుడు భీకరయుద్ధంలో సంహరిస్తారు. ఆ దుర్మార్గుడు చెరబట్టిన 16 వేల మంది మహిళలను రక్షిస్తారు. ఆ సంతోషాన్ని అన్ని లోకాల ప్రజలు ఆ మరుసటిరోజైన అమావాస్య నాడు దీపాలు వెలిగించి పండగ రూపంలో పంచుకుంటారు. ఇంటింటా దీపాలు వెలిగించి అతడిలా ఎవరూ ఉండొద్దని హెచ్చరించటం అనేది దీపావళి చాటే సత్ప్రవర్తనగా చెప్పొచ్చు. తమ బిడ్డల వల్ల సమాజానికి కీడు కలుగుతున్నపుడు దుష్టుడైన బిడ్డను శిక్షించటానికి తండ్రితోపాటు తల్లి కూడా పాల్గొనటం, వారి కర్తవ్యాన్ని చాటుతుంది. ఉత్తమ గాథ ఇది. విష్ణుమూర్తి వరాహ అవతారం ఎత్తి, హిరణ్యాక్షుడు సముద్రంలో పడేసిన భూమిని పైకి తీసుకొచ్చేటపుడు భూదేవికి, విష్ణుమూర్తికి కలిగిన సంతానమే నరకాసురుడు. దేవతలకు జన్మించినప్పటికీ దుష్టపనులు చేయటంతో అసురుడయ్యాడు. కృష్ణావతారంలో ఉన్నపుడు నరకాసురుడు చేస్తున్న దుర్మార్గపు పనులన్నింటినీ ఇంద్రుడు వచ్చి ఏకరువు పెడతాడు. దుష్టశిక్షణ అనివార్యమని తేల్చుకున్న శ్రీకృష్ణుడు, గరుత్మంతుడిపై ఎక్కి యుద్ధానికి బయలుదేరతాడు. అప్పుడు సత్యభామ రూపంలో ఉన్న భూదేవి, తాను కూడా వస్తానని పట్టుబడుతుంది. నరకాసుర సైన్యంతో భీకరంగా యుద్ధం జరుగుతుంది. చివరకు నరకాసురుడు వచ్చేసరికి సత్యభామ ముందుకొస్తుంది. విల్లు అందుకుని సంధించిన అస్త్రం గురి తప్పకుండా శత్రువును సంహరిస్తుంది. అబలగా భావించే స్త్రీ సమయం వచ్చినపుడు పురుషులను మించిన ప్రతిభను, శక్తిని చాటగలదని ఈ యుద్ధంతో చాటినట్టయింది. నరకాసురునితో జరిగిన యుద్ధంలో సత్యభామ, శ్రీకృష్ణుడు ప్రదర్శించిన అస్త్రశస్త్రాల మెరుపులు, శబ్దాలు భారీగా ఉన్నాయి. నరకుడు పడిపోగానే దేవతలు, మునులు ఆకాశం నుంచి పూలజల్లు కురిపిస్తారు. మరుసటిరోజు అమావాస్య కావటం, ఆ చీకటిని పారదోలి వెలుగును నింపటానికి దీపాలను వెలిగించటం, అస్త్రశస్త్రాల మెరుపులు, ధ్వనులకు బాణసంచా కాల్చటాన్ని పండుగ కలిపింది. దేవతలు చల్లిన పూలు... తారాజువ్వలు, మతాబులు అన్నట్టుగా ఉంది. కాలానుగుణ మార్పులతో దీపావళి అంటే బాణసంచా కాల్చడమే అన్నట్లు తయారైంది. ఈ ఆచారం ద్వాపరయుగంలో లేదు.. కలియుగంలోనే సుమా!

### అంతరార్థం ఉంది...



నిజానికి దీపావళి పితృదేవతలను ఆరాధించే పండుగ. లక్ష్మీదేవిని పూజించే పండుగ. దీపావళి నుంచి ఆరంభించి, తర్వాతి రోజు నుంచి వచ్చే కార్తికమాసంలో అన్నిరోజులూ ఇళ్లలో, ఆలయాల్లో దీపాలు వెలిగిస్తూ అగ్ని హోత్రుడిని ఆరాధించటం చూస్తుంటాం. దీపావళిలో నీతి బోధతో పాటు సామాజిక ప్రయోజనాలూ కనిపిస్తాయి. వర్షాలు కురిసి చేలల్లో, రహదారులపై నీరు నిలిచివుంటుంది. దోమలు, ఇతర క్రిమికీటకాల సంహారానికి బాణసంచా కాల్చటం పనికొస్తుందంటారు. జాగ్రత్తగా కాల్చటం నిప్పును ఎదుర్కోవటం, అగ్ని పట్ల జాగ్రత్తను అలవాటు చేయటంగా చెబుతారు. పెరిగే చలి, క్రిమికీటకాల బాధను దీపాలు పోగొడతాయి. సత్యభామ, శ్రీకృష్ణుడికి పూజలేమీ చేయకుండా దీపాలు వెలిగించటం, బాణసంచా కాల్చటం, లక్ష్మీపూజ చేయటం వంటి విశేషాల సమాహారం దీపావళి.

## కార్తిక పూజలకు వేళాయె..

### శివాలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు



శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారు



ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసానికి సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారి, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్తిక మాసం శుద్ధ పాడ్యమి నవంబర్ 2 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు రానుంది. ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా నిత్యం ఉదయం మహాన్యాస పూర్వక రుద్ర జప, రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించనున్నారు. పరోక్ష అభిషేక పథకాన్ని కూడా అధికారుల ప్రవేశపెట్టారు. రూ. 2,000 చెల్లించిన వారికి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపించనున్నారు. నవంబర్ 26న భక్తులచే సామూహిక లక్ష బిల్వార్చన ఉంటుంది. నవంబరు 29న మాస శివరాత్రి రోజు పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు జరిపించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేయడం చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. భక్తులు ఇబ్బంది పడకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసు, అగ్నిమాపక, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖల సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కార్తిక పౌర్ణమి నాడు కోటి దీపోత్సవం ఉంటుందని చెప్పారు. పర్వదినములలో ప్రత్యేక పూల అలంకారం, విద్యుద్దీపాల అలంకరణ ఉంటుందని వివరించారు.

### అమరేశ్వరాలయం ముస్తాబు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయం కార్తిక మాసోత్సవాలకు ముస్తాబవుతోంది. సామాన్య భక్తులతో పాటు పంచారామ యాత్రికులకు స్వామి దర్శనం త్వరితగతిన జరిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన దేవాలయంలో చేసిన ప్రత్యేక ఏర్పాట్ల గురించి వివరించారు. నవంబరు 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తిక మాసంలో భక్తులకు వసతి, ఉచిత దర్శనం, ప్రసాదం, పరిమిత స్థాయిలో అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్నాన ఘట్టాలలో తాత్కాలిక మరుగుదొడ్లు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బందిని పెంచి ఆలయ పరిశుభ్రంగా ఉంచుతామని చెప్పారు.

## న్యూస్‌రీల్

### త్రికోటేశ్వరుడికి రూ.49,93,142 ఆదాయం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం హుండీల ద్వారా రూ.49,93,142 ఆదాయం లభించినట్టు ఈవో దాసరి చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ హుండీల లెక్కింపు బుధవారం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 104రోజులకు హుండీల ద్వారా రూ.45,40,704, అన్నదాన హుండీ ద్వారా రూ.4,52,438 ఆదాయం లభించినట్టు వివరించారు. హుండీ లెక్కింపులో భక్త సమాజం ప్రతినిధులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### పిల్లేరు వాగులోకి దూసుకెళ్లిన టిప్పర్



మాచవరం: మండలంలోని నాగేశ్వరపురం తండా సమీపంలోని పిల్లేరు వాగులోకి టిప్పర్ దూసుకెళ్లిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నాలుగు రోజులుగా చప్టాపై నీరు పారుదల ఆగిపోయింది. ఈ మార్గాన ఇసుక లారీలు, ట్రిప్పర్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. నాగేశ్వరపురం వైపు నుంచి బెల్లంకొండ మండలానికి వెళుతున్న టిప్పర్ మూల మలుపు వద్ద అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

### గుంటూరులో భారీ వర్షం



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమైనప్పటికి..సాయంత్రం 4.30 గంటల నుంచి నల్లటి మబ్బులు కమ్ముకున్నాయి. పెద్ద పెద్ద చినుకులతో అరగంట సేపు వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం దీపావళి కావడంతో నగరంలో పలు ప్రాంతాల్లో సంబంధిత దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు నానా తంటాలు పడ్డారు. పలు చోట్ల మురుగునీరు రోడ్డుపైకి చేరింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

### ఆర్చరీ క్రీడాకారిణికి సత్కారం



తాడేపల్లిరూరల్ : అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖను కుంచనపల్లిలోని ఆమె నివాసంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు మర్యాదపూర్వకంగా ఆమెను కలసి శాలువాతో సత్కరించి, పూలమొక్క అందజేశారు. ఆర్చరీలో మరిన్ని పతకాలు సాధించాలని రవికుమార్ నాయుడు అన్నారు.

### నేలకొరిగిన భారీ వృక్షం



సత్తెనపల్లి: గాలి, వర్షం కారణంగా బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలోని భారీ చింత చెట్టు కూలింది. పెద్ద పెద్ద కొమ్మలు కార్యాలయ ప్రహరీ గోడ మీద నుంచి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. గోడను ఆనుకుని ఉన్న టీ, స్టాంప్‌ల విక్రయ దుకాణంతో పాటు ద్విచక్ర వాహనంపై కూడా కొమ్మలు పడటంతో అవి ధ్వంసం అయ్యాయి. నిత్యం స్టాంపు వెండర్లు, భూముల కొనుగోలు, అమ్మకందారులు, కోర్టుకు వచ్చే కక్షిదారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. అయితే, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## కొలిక్కి రాని మద్యం షాపుల వ్యవహారం

జిల్లాలో ఎక్కువ శాతం దుకాణాలకు అందని ఒరిజినల్ లైసెన్స్



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా కార్యాలయం

నెహ్రూనగర్: జిల్లాలోని చాలాచోట్ల మద్యం షాపుల ఏర్పాటు మరింత ఆలస్యం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నెల 14న లాటరీ ద్వారా షాపులను దక్కించుకున్న వారు వారం పాటు తాత్కాలికంగా మద్యం విక్రయించుకునేందుకు ప్రొవిజనల్ లైసెన్స్ ఇచ్చారు. దీని గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించారు. మద్యం షాపు పెట్టాలంటే వంద మీటర్ల పరిధిలో దేవాలయం, మసీదు, చర్చి, పాఠశాలలు, ఆసుపత్రులు ఉండకూడదు. గతంలో మాన్యువల్ విధానంలో షాపుల కేటాయింపు జరిగేది. ఈ సారి ఎయిర్ వ్యూ పద్ధతిలో డ్రోన్ సహాయంతో వంద మీటర్లు పైబడి ఉంటేనే మద్యం షాపులు పెట్టుకోవడానికి అధికారులు అవకాశం ఇస్తున్నారు. అప్పుడే ఒరిజినల్ లైసెన్స్ జారీ చేస్తున్నారు. గుంటూరు నగరంలో మొత్తం 33 మద్యం షాపులు మంజూరు అయ్యాయి. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో కొన్ని చోట్ల షాపులు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఒరిజినల్ లైసెన్స్ ఉంటేనే డిపో నుంచి మద్యం స్టాక్ ఇస్తారు. 127 దుకాణాలకుగాను 30 మందికి కూడా ఈ లైసెన్స్ రాలేదని సమాచారం. అప్పటివరకు ఉన్న స్టాక్‌ను మాత్రమే విక్రయించుకోవాలి. అధికార పార్టీకి చెందిన వారు కాకుండా ఇతరులు లాటరీలో దుకాణం దక్కించుకుంటే కూటమి నేతలు ఇబ్బంది పెడుతున్నారు. ఇంకొందరు కమీషన్ తీసుకుంటున్నారు.

### నిబంధనలు పాటించాలి

గుడి, బడికి వంద మీటర్ల దూరం దాటాకే మద్యం షాపులు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఎయిర్ వ్యూ (డ్రోన్ సహాయంతో గాలిలో కొలిచి, వంద మీటర్ల పరిధిలో గుడి, బడి, ఆసుపత్రి ఏమీ లేదని తేల్చుతారు.) ద్వారా షాపు పెట్టుకోవడానికి అనుమతి ఇస్తున్నాం.

– డాక్టర్ కె.శ్రీనివాస్,
డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ

## పర్సన్ ఇన్‌చార్జిగా భార్గవ్ తేజ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎ.భార్గవ్ తేజ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా యార్డు ఆవరణలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యార్డులో పర్యటించారు. క్రయవిక్రయాల తీరు, ప్రస్తుతం మిర్చి ధరలు, బిడ్డింగ్ విధానం, రైతులకు గిట్టుబాటు ధర లభ్యత తదితరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. మిర్చి కమీషన్ షాపులు, రైతు విశ్రాంతి భవనం, ఉచిత భోజన శాల, ఇతర వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా భార్గవ్ తేజ మాట్లాడుతూ.. రాబోవు మిర్చి సీజన్ నాటికి యార్డులో పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, గ్రేడ్–1 కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గ్రేడ్–2 కార్యదర్శి ఆంజనేయ సింగ్, యార్డు ఇన్‌చార్జి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**36,108 బస్తాల మిర్చి విక్రయం**

గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 29,664 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 36,108 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,700 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 18,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,835 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

### యార్డుకు నేడు సెలవు

గుంటూరు మార్కెట్ యార్డుకు దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం సెలవు ప్రకటించినట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం యార్డులో యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. శని, ఆదివారం సాధారణ సెలవులు ఉంటాయని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు గురువారం మిర్చి యార్డుకు సరుకు తీసుకురావద్దన్నారు.

# వెలుగు పూలు ఇలా..

• బాణసంచా పేల్చే సమయంలో నిర్లక్ష్యం తగదు • చిన్నారుల విషయంలో అప్రమత్తత అవసరం • ప్రమాదరహితంగా దీపావళి పండుగ



గుంటూరులోని టపాసుల దుకాణాల వద్ద రద్దీ

పట్నంబజారు : ప్రతి ఒక్కరి కుటుంబంలో వెలుగులు నింపే పండుగ దీపావళి. సంతోషాల సంబరాల నడుమ చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎంతో ఉత్సాహంగా వేడుక చేసుకుంటారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బాణసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి. నేడు దీపావళి కావటంతో మరింత రెట్టింపు ఉత్సాహంతో యువత, చిన్నారుల టపాసులు కొనుగోలు చేస్తున్నారు. గుంటూరు జిల్లా పరిధిలో మొత్తం 100 షాపులు ఏర్పాటు చేశారు. ఏడాది మొత్తం విక్రయాలు జరిపే గోడౌన్‌లు సుమారుగా 20పైగా గుంటూరు జిల్లాలో ఉన్నాయి. వీటిలోనూ విక్రయలు జోరుగా సాగుతున్నాయి.

టపాసులు కాల్చేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా చిన్నారులు కాల్చే సమయంలో పెద్దలు దగ్గర ఉండి ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలి. కొద్ది రోజుల క్రితమే వినాయకచవితి వేడుకల్లో భాగంగా బాణసంచా ప్రమాదవశాత్తు పేలి.. ఒక వ్యక్తి తీవ్రగాయాలపాలైన ఘటన నల్లచెరువులో చోటు చేసుకుంది. గత ఏడాది ఏటీ అగ్రహారంలో ఒక చిన్నారి దుస్తులకు మంటలు అంటుకుని శరీరమంతా కాలిపోయింది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగుల హరివిల్లు పూయించాలని కోరుకుందాం.

**నిబంధనల ప్రకారమే లైసెన్స్‌లు...**

బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు అధికారుల అనుమతులు తప్పనిసరి. అధికారులు అన్నివిధాలా పరిశీలించి ధ్రువీకరించిన తరువాతనే షాపు ఏర్పాటుకు అనుమతి ఇస్తారు. ఖాళీ స్థలంలో దుకాణం ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఉంటాయి. ఈ ప్రాంతంలో ఎలాంటి పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్ వంటివి ఉండకూడదు. ఒక 50 షాపులు ఉంటే దానిని క్లస్టర్ అని అంటారు. అంతకు మించి ఆ గ్రౌండ్స్‌లో దుకాణాలకు అనుమతి ఇవ్వకూడదు. జిల్లా కేంద్రంలో జిల్లా ఫైర్ ఆఫీసర్, గ్రామీణ ప్రాంతాలలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. హోల్‌సేల్ వ్యాపారాలకు సంబంధిచి ఉన్న సరుకు లిస్ట్, కట్టిన జీఎస్టీ, తదితర అంశాలను పరిశీలించి అనుమతులు ఇస్తారు. దీంతోపాటు ప్రతి బాణసంచా దుకాణం వద్ద ఇసుకతో ఉన్న బక్కెట్లు, ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తప్పని సరిగా పాటించాల్సి ఉంటుంది.



బాణసంచా కొనుగోలు చేస్తున్న దృశ్యం

### ఈ నిబంధనలు తప్పనిసరి.....

- షాపులు ఖాళీ ప్రదేశాలలో మాత్రమే ఏర్పాటు చేయాలి.
- జనావాసాలకు దూరంగా ఉన్న ఒక అంతస్తు మాత్రమే ఉండే భవనాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు.
- దుకాణానికి, దుకాణానికి మధ్య ఖాళీ ఉండాలి. అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.
- ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగితే తక్షణం నియంత్రించేలా ఏర్పాట్లు ఉండాలి.

### పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే....

- లైసెన్స్ కలిగిన షాపుల నుంచే బాణసంచా కొనాలి.
- అగ్ని ప్రమాదాలు జరగని ప్రదేశంలో వీటిని భద్రపరచాలి.
- బాణసంచా కాల్చే సమయంలో వాటిపై ఉన్న నిబంధనలు చదివి పాటించాలి, ఖాళీ ప్రదేశాల్లోనే కాల్చాలి
- బాణసంచా కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి.
- కాటన్ దుస్తులు వేసుకోవాలి. ఖచ్చితంగా చెప్పులు ధరించాలి
- జనావాసాలు, రద్దీ ప్రాంతాలలో పెద్దపెద్ద టపాసులు కాల్చరాదు.
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నపిల్లలు బాణసంచా కాల్చాలి.
- కాలని క్రాకర్స్ వద్దకు వెళ్లి వాటిని చేతులతో పరీక్షించవద్దు.
- బాంబుల వంటి వాటిని చేతితో పట్టుకుని కాల్చవద్దు.
- సొంతంగా తయారు చేసిన బాణసంచాను కాల్చే యత్నం చేయవద్దు.

## అమరవీరుల త్యాగాలు
# స్మరణీయం

నగరంపాలెం: పోలీస్ అమరవీరుల త్యాగాలు, సేవలు అందరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) నుంచి ఎస్‌బీఐ ఎదురు ఉన్న పోలీస్ అమరవీరుల స్తూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో జిల్లా ఎస్పీ, ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 3,000 గరిష్ఠం : రూ. 3,800

మోడల్ ధర రూ. 3,400

## క్లుప్తంగా

### అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

నగరంపాలెం: దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వెలుగుల్లో ప్రతి ఒక్కరూ విజయ పథం వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ దీపావళి పర్వదినం అందరికి సుఖాలు, సౌభాగ్యాలు, సంపదలు తేవాలని, అందరి జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలని అన్నారు. జిల్లా ప్రజలకు, పోలీస్ యంత్రాంగానికి దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

### బాల్‌బాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు విద్యార్థిని ఎంపిక



నగరం: స్థానిక బాలయేసు స్కూల్‌కు చెందిన యార్లగడ్డ శివనందిని బాల్‌బాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సిస్టర్ సజ్వీ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. శివనందిని ఇటీవల శావల్యాపురంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట జట్టుకు ఎంపికై ందన్నారు. బాలికను హెచ్‌ఎంతోపాటు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఎల్సిటామ్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వైవీ గోపయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్కిల్ సెన్సెస్ సర్వేని వేగవంతం చేయాలి

బాపట్ల: స్కిల్ సెన్సెస్ సర్వే వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ సువార్త పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ స్కిల్ సెన్సెస్ సర్వేపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, న్యాక్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎల్‌డీఓ పద్మావతి, రేపల్లె పద్మజ, గాయత్రి, పి.ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి**



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు. వేదికపై మోదుగుల వేణుగోపాల రెడ్డి, బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

పట్నంబజారు: అందరం కలిసి కట్టుగా ముందుకు సాగుదామని, పార్టీ పటిష్టతే ధ్యేయంగా కమిటీ నిర్మాణం జరగాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయి నేతల సమావేశం జరిగింది. అంబటి రాంబాబుతోపాటు గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు కానున్నాయని గుర్తుచేశారు. ఈ తరుణంలో పార్టీ జెండా భుజాన మోసిన వారికే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. జిల్లా కమిటీకి సంబంధించి గ్రామ, మండల స్థాయి నేతలు, నియోజకవర్గ సమన్వయకర్తతో చర్చించి పేర్లు ప్రతిపాదించాలని సూచించారు. గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ... ఐదేళ్లపాటు టీడీపీ దుష్ట రాజకీయాలను ఎదుర్కోవాల్సి ఉందని గుర్తుచేశారు. తద్వారా ఎన్నో కష్టాలు ఎదురవుతాయని తెలిపారు. ఆ కష్టంలో నుంచే నాయకుడు పుడుతాడన్న అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పదవి అనేది ఒక ఆయుధం, పదవి తీసుకున్న ప్రతి ఒక్కరూ పార్టీకి అండగా నిలబడి జెండా భుజాన వేసుకుని ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు.

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విభేదాలు పక్కన బెట్టి ఐకమత్యంతో ముందుకు సాగాల్సిన సమయం ఇదేనన్నారు. ఎన్నికల తరువాత కొద్దిపాటి బాధతో తాను నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో లేని మాట వాస్తవమేనని, ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అనంతరం అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, బలసాని కిరణ్‌కుమార్‌లు జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మండేపూడి పురుషోత్తం, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆవుల సుందరరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, పిల్లి మేరి, మెట్టు వెంకప్పారెడ్డి, రామకృష్ణ, మురళి, ఓం ప్రకాష్, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

### మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను డీఈవోజీఎన్‌టీబ్లాగ్‌స్పాట్.ఇన్ సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే షెడ్యూల్ ప్రకారం నవంబర్ ఒకటో తేదీన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు.

### ఒకటిన నగర అభివృద్ధిపై స్టేక్ హోల్డర్ల సమావేశం

నెహ్రూ నగర్: గుంటూరు నగరాభివృద్ధిపై సూచనలు, సలహాలు అందించేందుకు నవంబర్ 1న జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో స్టేక్ హోల్డర్స్ మీటింగ్ ఉదయం 10. 30గంటలకు జరగనుంది. ఈ మేరకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, టాక్స్ పేయర్స్ ప్రతినిధులు పాల్గొని సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

# పోలీసు జీపు ఢీ కొని వృద్ధురాలు మృతి



అనసూర్యమ్మ మృతదేహం

పెదకాకాని: పోలీసు జీపు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. పాతగుంటూరుకు చెందిన సుంగారపు అనసూర్యమ్మ తన కుమార్తె వివాహం అనంతరం నివాసం ఉంటున్న ఇల్లు విక్రయించింది. సుమారు 20 ఏళ్లుగా పెదకాకాని శివాలయం వద్దనే ఉంటూ జీవనం సాగిస్తోంది. నవంబరు 2వ తేదీ నుంచి పెదకాకాని శివాలయంలో కార్తికమాసం పురస్కరించుకుని బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు పెదకాకాని సీఐ టి. నారాయణస్వామి బుధవారం శివాలయానికి వచ్చారు. ఆ సమయంలో జీపు డ్రైవర్‌గా ఉన్న హోంగార్డు షేక్ అజీజ్ జీపును రివర్స్ చేస్తూ భక్తులు తలనీలాలు సమర్పించే గది ప్రహరీని ఢీకొట్టాడు. గోడపై తలనీలాలు గది నిర్మించిన దాతల పేర్లతో కూడిన శిలాఫలకం ఉంది. ఆ దిమ్మె కూలి వెనక్కి పడింది. ఆ సమయంలో గోడ పక్కనే దుస్తులు ఆరవేస్తున్న అనసూర్యమ్మ చేయిపై శిలాఫలకం పడటంతో చెయ్యి నుజ్జు నుజ్జు అయి రక్తస్రావం అయింది. బాధితురాలిని వెంటనే అదే పోలీసు జీపులో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అనసూర్యమ్మ(71) మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మనుమడు గద్దె వెంకటసురేష్‌బాబు ఫిర్యాదు మేరకు జీపు డ్రైవర్ షేక్ అజీజ్ పై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ టి.నారాయణస్వామి తెలిపారు.

### చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

పట్నంబజారు: చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరు కొత్తపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం. వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం... కొద్ది రోజుల కిందట గుంటూరు నగరం మహిళా కళాశాల రోడ్డులోని ఓ వస్త్ర దుకాణంలో దుస్తులు చోరీకి గురయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో వెంగళరావునగర్‌కు చెందిన యద్దనపూడి దేనాభాస్కర్ అలియాస్ దేనా, గుంటూరు శ్రీనగర్‌కు చెందిన వింజేపల్లి మేరీబాబు అలియాస్ మేరి, మరో మైనర్‌ని అదుపులోకి తీసుకుని విచారించగా, పలు వస్తువులను చోరీ చేసినట్టు అంగీకరించారు. చోరీ చేసిన దుస్తులతో పాటు దొంగతనం చేసిన మూడు ద్విచక్ర వాహనాలు, దుస్తులు, బంగారం, కలర్ టీవీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు

### క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌ల్లో భాగంగా బుధవారం ఏసీఏ-బి, ఏసీఏ-సీ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఏసీఏ-సి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 56.3 ఓవర్లకు 214 పరుగులు చేసింది. జట్టులోని బి.మనుదర్శన్ 56 పరుగులు చేశాడు. ఏసీఏ-బి బౌలర్ ఎం.పూర్ణచంద్ర 14 ఓవర్లలో 45 పరుగులు ఇచ్చి 5 వికెట్లు సాధించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఏసీఏ-బి జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 16 పరుగులు చేసింది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

# ట్రామా వైద్య సేవలకు ప్రాధాన్యం

- గుంటూరు జీజీహెచ్ పూర్వ వైభవానికి కృషి
- సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌ఎస్‌వీ రమణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ట్రామా వైద్య సేవలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ అన్నారు. ఏడు జిల్లాలకు చెందిన రోగులు, రోడ్డు ప్రమాద బాధితులు అత్యవసర చికిత్సల కోసం ఇక్కడికి వస్తుంటారని గుర్తుచేశారు. సకాలంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. జీజీహెచ్‌లో ట్రామా ఆపరేషన్ థియేటర్ సత్వర నిర్మాణానికి కృషి చేస్తానని వెల్లడించారు. బుధవారం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జీజీహెచ్‌కు పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలు వైద్య విభాగాలకు ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ లేఅవుట్లలో మార్చిలోగా ఇళ్ల నిర్మాణం



మాట్లాడుతున్న పీడీ జీవీవీ ప్రసాద్

తెనాలి: ప్రభుత్వ లేఅవుట్లలో వచ్చే ఏడాది మార్చిలోగా తొలి విడత ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీవీ ప్రసాద్ కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన వంద రోజుల ప్రణాళికకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం సాయంత్రం గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ ఉద్యోగులు, సచివాలయాల్లోని ఎమినిటీస్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు అందరూ ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యాంశంగా తీసుకుందన్నారు. జిల్లాస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో వంద రోజుల ప్రణాళిక కోసం పని చేస్తున్నట్టు తెలిపారు. దిగువస్థాయిలో గృహనిర్మాణ సంస్థ అధికారులు, సచివాలయాల ఎమినిటీస్ కార్యదర్శులు కూడా సమష్టిగా పనిచేసి, లక్ష్యాన్ని సాధించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, గృహనిర్మాణ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు భాస్కరరావు, డీఈఈ రఫీవుల్లాఖాన్, ఏఈ పిచ్చయ్య పాల్గొన్నారు.

# ఈవీఎంలతో మోసగిస్తున్న ఎన్డీఏ

**భారతీయ పార్టీల మూడవ కూటమి ఆరోపణ**



లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

నెహ్రూనగర్: గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రధాన భాగస్వామిగా ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈవీఎంలను అడ్డం పెట్టుకొని గెలుస్తోందని భారతీయ పార్టీల మూడవ కూటమి రాష్ట్ర అధ్యక్షుడు బూరుగ రత్నం ఆరోపించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కూటమి ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఈవీఎంలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ సేకరించిన 60 లక్షల ఈవీఎంలలో కేవలం 40 లక్షలు మాత్రమే ఆయా సందర్భాలలో వాడుతున్నారని చెప్పారు. మిగిలిన ఈవీఎంల గురించి సమాధానం రావట్లేదని విమర్శించారు. ప్రధాని మోడీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని వ్యవస్థలలో ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలు చేసే వ్యక్తులకు ఉన్నత పదవులు కట్టబెట్టడం నియంతృత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యాధులు దీనిపై నిరసనను తెలియజేయాలని కోరారు. భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికలు ఈవీఎంల మాయాజాలంతోనే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిచిందని ఆరోపించారు. భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్రలను సాగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు దొడ్డ రవీంద్ర, జయ కుమార్, బహుజన రాజకీయ జేఏసీ నాయకులు సాధు మాల్యాద్రి, నాయీ బ్రాహ్మణ జేఏసీ నాయకులు తాటికొండ నరసింహారావు, కృష్ణవేణి, రంగమ్మ, శ్రీవాణి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# అండర్-14 హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

తెనాలి: రాష్ట్ర అండర్-14 బాల, బాలికల హ్యాండ్ బాల్ జట్లను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. ఎంపికైన జట్లు నవంబరు నెలాఖరులో ఛత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

**బాలుర జట్టు ఇదే..**
వల్లెపు హరీష్, యలగాల అనిల్, పచ్చ కార్తీక్, మాలిశెట్టి విజేష్ (గుంటూరు), బుక్కి గోవర్ధన్ నాయక్, బుస్సా సాయినాథ (చిత్తూరు), యర్రగుంట్ల దయాసాగర్, మొలకల చిరుత (ప్రకాశం), కడియం సంతోష్‌కుమార్, రవ్వైన ఏసు, బొమ్మల యశ్వంత్ (కృష్ణా), ఆరిక చరణ్ (విజయనగరం), గురుగుబెల్లి సోమశేఖర్ (శ్రీకాకుళం), మామిడి గిరీష్‌కుమార్ (నెల్లూరు), కుండ్రపు నాగేంద్రసాయి (పశ్చిమ గోదావరి), కాశీనగరి హేమసుందర్ (కడప).

**బాలికల జట్టు...**
రమావత్ సింధూర, సంకురి హదస్సా, విస్సా జుహిత, తిరుమలశెట్టి నాగశ్రావ్య, గుండెగ బాల భవ్య (గుంటూరు), పఠాన్ సాఫియా, భవిరెడ్డి జాహ్నవి (కృష్ణా), గడ్డం చందు, వాడపల్లి వర్షిత (ప్రకాశం), మావిళ్ల నిహారిక, వి.మోక్షిత (చిత్తూరు), షేక్ షహనాజ్ (కర్నూలు), నాగిరెడ్డి హారిక (విజయనగరం), సరిబాల కావ్య (కడప), దుంప ప్రసన్నకుమారి (శ్రీకాకుళం), కొత్తపల్లి శైలజ (అనంతపురం).

# ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికే ఇసుక



వాహనదారులకు సూచనలిస్తున్న రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి

కొల్లూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో నిబంధనలు వర్తిస్తాయని రేపల్లె ఆర్డీఓ ఎన్. రామలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని గాజుల్లంక, జువ్వలపాలెం ప్రాంతాలలో ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లతోపాటు ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి పోలీసులు ఏర్పాటు చేయాల్సిన చెక్‌పోస్టు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న వాహనదారులకు పలు సూచనలు చేశారు. రవాణాదారులు ఇష్టానుసారం ఇసుక తరలింపు చేపట్టడం సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. అవసరమైన వ్యక్తులు ముందుగా ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని అన్నారు. వారు మాత్రమే ఇసుకను ఉచితంగా తరలించుకోవడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. వినియోగించే వాహనాలు సైతం మైనింగ్ శాఖ వద్ద నమోదు చేసుకుని ఉండాలన్నారు. ప్రతి ట్రిప్పునకు జియో ట్యాగింగ్ ఉండాలని పేర్కొన్నారు. వాహనం ముందు ఉచిత ఇసుక రవాణా వాహనం అని బోర్డు ఉండాలని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైను ఇసుక కోసం గ్రామ సచివాలయాలలో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రతన్‌టాటాకు సైకిల్ యాత్రికుడి ఘన నివాళులు

**విశాఖ నుంచి కన్యాకుమారి వరకు సైకిలు యాత్ర**



రేపల్లెకు చేరుకున్న బాలరాజు

రేపల్లె రూరల్: దేశానికి తన సేవలు అందించి పలువురికి ఆదర్శంగా నిలిచిన వ్యాపార దిగ్గజం, సేవాతత్పరుడు రతన్‌టాటాకు నివాళిగా ఓ యువకుడు సైకిలుయాత్రకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లో చేస్తున్న ప్రైవేటు ఉద్యోగానికి వీడ్కోలు పలికి యాత్రకు బయలుదేరారు. పార్వతిపురం మాన్యం జిల్లాలోని జిమ్మిడి జ్వాల గ్రామానికి చెందిన పొన్నాన బాలరాజు రతన్‌టాటా సేవలను పలువురికి తెలియజెప్పటంతోపాటు ఘన నివాళులు అర్పించాలన్న లక్ష్యంతో విశాఖపట్నం నుంచి కన్యాకుమారి వరకు సైకిలుయాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన విశాఖపట్నం నుంచి సైకిలుయాత్రను ప్రారంభించి బుధవారం రేపల్లెకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఆ మహనీయుని సేవలను ప్రజలకు తెలియజేస్తూ 20 రోజుల్లో సైకిలు యాత్రను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రోజుకు 85 నుంచి 100 కిలోమీటర్ల వరకు వెళ్తున్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో పెట్రోలు బంకులు, దేవాలయాలు, విద్యాలయాలలో బస చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# మెనూ పాటించకుంటే క్రిమినల్ చర్యలు

- హాస్టల్ వార్డెన్లు, ప్రిన్సిపాళ్లను హెచ్చరించిన కలెక్టర్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

నరసరావుపేట: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో నిబంధనల మేరకు మెనూ పాటించాలని, అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ, క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సంబంధిత హాస్టల వార్డెన్లు, ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా, పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. నిరంతర నీటి సరఫరా, పరిశుభ్రత, ఫ్యాన్లు, వెలుతురు సరిగా ఉండేలా లైటింగ్ ఉండాలన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులచే పనులు చేయించరాదన్నారు. బాలికల వసతి గృహాలలో ప్రహరీ, ఫెన్సింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వసతి గృహాలలో నైట్ వాచ్‌మెన్‌లు ఉండాలన్నారు. ప్లస్ టూ వసతి గృహాలలో నైట్ వాచ్‌మెన్‌లు విధిగా పరిస్థితులు గమనించాలన్నారు. వచ్చేనెల రెండోవారం నుంచి అధికారులతో కలసి వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణ మెరుగుపరచుకోవలసిన అవసరం ఉందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, వెనుకబడిన తరగతుల అధికారి నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మి, సంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాల జిల్లా అధికారి పద్మజ పాల్గొన్నారు.

### అవతరణ దినోత్సవంలో పిడుగురాళ్ల కవి రచనకు చోటు

పిడుగురాళ్ల: రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ఏర్పాటైన గానలహరిలో తన రచనకు చోటు దక్కడంపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పిడుగురాళ్లకు చెందిన కవి వైహెచ్‌కే మోహన్ రావు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో నవంబర్ 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ఏర్పాటైన గానలహరిలో ''జయహో జయ జయహో జయ జయహో జననీ, శుభమస్తు..విజయోత్సవం భావని ఆంధ్రావని''. అంటూ సాగే తన రచనకు చోటు లభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రాశస్త్యాన్ని ఆవిష్కరించే వివిధ అంశాలు ఈ గీతంలో ఉంటాయన్నారు. ప్రజా గాయకుడు, అమరావతి సాంస్కృతిక కన్వీనర్ పీవీ రమణ తన గీతానికి బాణి, సంగీతాన్ని సమకూర్చి తన గాయక బృందంతో కలిపి ఆలపించారన్నారు.

### మద్యం అక్రమ విక్రేతలు అరెస్ట్

క్రోసూరు: గుంటూరు జిల్లా ఎన్‌ఫోర్సుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ సీఐ టి.తులసి, సిబ్బంది బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తెలంగాణకు చెందిన 64(41.6 లీటర్లు) బాటిళ్ల బీర్లు, 110 క్వార్టర్ (19.8 లీటర్ల) ఆంధ్ర మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులు బాణావత్ బద్రునాయక్, భూక్యా శివకృష్ణనాయక్ , రూపావత్ రాజానాయక్‌లను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, క్రోసూరు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

# నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్‌బాల్ అండర్-14, అండర్ -17 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఏఎంజీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. పోటీలను ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ పోటీలకు బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 256 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనపర్చిన క్రీడాకారుల నుంచి జిల్లాజట్లను ఎంపిక చేశారు. అండర్-14 బాలికల విభాగంలో 12 మందిని, బాలుర విభాగంలో 12 మందిని, అండర్ -17 బాలికల విభాగంలో 12 మందిని, బాలుర విభాగంలో 12 మందిని ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సురేష్ కుమార్, టోర్నమెంట్ అబ్జర్వర్‌లు రమాదేవి, షేక్ బాజి, ఏఎంజీ వైస్ ప్రెసిడెంట్ ఎడ్విన్‌పాల్, స్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.